క్లుప్తంగా

అప్పన్నకు పౌర్ణమి తిరువీధి



అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం సాయంత్రం తిరువీధిని వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేశారు. ఆలయ బేడామండపంలో తిరువీధి జరిపారు. విశేష హారతులు అందించారు. అధ్యాపకులు పారాయణం చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు జరిపారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

వేంకటాద్రిపై శ్రీనివాస కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రి పైనున్న వేంకటేశ్వర ఆలయంలో చాతుర్మాస్య దీక్షలో భాగంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీనివాస కల్యాణమహోత్సవాన్ని తిలకించారు. స్వామిని దర్శించుకు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత వెంకటేశ్వర్లుకు బాండ్ అందిస్తున్న ఏఈవోలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గుజరాత్‌లోని జామ్‌నగర్‌కి చెందిన ఎం.ఎస్.వెంకటేశ్వర్లు లక్షా ఒక రూపాయి విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, అన్నప్రసాదం విభాగం ఏఈవో రమణమూర్తిలు దాతకు బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

అప్పన్నను దర్శించుకున్న రఘు కుంచె



రఘు కుంచెకు అప్పన్న ప్రసాదం అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సినీ సంగీత దర్శకుడు, గాయకుడు రఘు కుంచె మంగళవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు అందించారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి

మహారాణిపేట: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులకు ముఖ ఆధారిత హాజరును యాప్ ద్వారా నమోదు చేస్తున్నట్లు నీటి యాజమాన్య సంస్థ జిల్లా పథక సంచాలకురాలు ఆర్.పూర్ణిమాదేవి ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పనులకు వచ్చే 47,725 మంది వేతనదారులకు ఈ-కేవైసీ చేస్తామని పేర్కొన్నారు. వేతనదారులందరూ ఆధార్ కార్డులు, జాబ్‌కార్డులతో ఫీల్డ్ అసిస్టెంట్ వద్ద ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ చేయని వారికి వేతన చెల్లింపులకు అవకాశం లేనందున కార్డుదారులంతా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని తెలియజేశారు.



ముంపులో పోలీస్ స్టేషన్ దరి సబ్బవరం-విశాఖ ప్రధాన రహదారి



సబ్బవరం-చోడవరం రోడ్డులో గొర్లివానిపాలెం జంక్షన్ నీటి ముంపులో వాహనాల రాకపోకలు

చినుకు పడితే..
రోడ్లన్నీ చెరువులే!

- గెడ్డలు, కొండ వాగుల అక్రమణల వల్లే ఈ **దుస్థితి**
- రోడ్డుకు ఇరువైపులా **డ్రైన్లు** లేకపోవడంతో మరీ **అధ్వానం**
- చిన్నపాటి వర్షానికీ **ముంపులో** ప్రధాన రహదారులు
- వాహనాల రాకపోకలకు **తీవ్ర ఇబ్బందులు**

సబ్బవరం మండల పరిధిలో గెడ్డలు, కొండవాగులు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. సహజ నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా సబ్బవరం మీదుగా పలు ప్రాంతాలకు, ఇతర ప్రాంతాల నుంచి సబ్బవరం వచ్చే ప్రధాన రహదారులు, కూడళ్లు, గ్రామాలు భారీ ముంపునకు గురవుతున్నాయి. కొన్ని రోజులపాటు చెరువుల్ని తలపిస్తున్నాయి. ఫలితంగా వాహనాల రాకపోకలు స్తంభించిపోతున్నాయి.

సబ్బవరం: మండల పరిధిలో ప్రధాన రోడ్లకు ఇరువైపులా డ్రైన్లు అభివృద్ధి చేయలేదు. కొన్ని చోట్ల ఉన్న డ్రైన్లు కూడా ఆక్రమణలకు గురయ్యాయి. వీటికితోడు మండల కేంద్రంలో ఉన్న గెడ్డలు, కొండవాగులు, డ్రైన్లు ఆక్రమణలతో కుంచించుకుపోయాయి. దీంతో వర్షం పడితే మండలవాసులు, ఇతర ప్రాంతాల నుంచి మండల కేంద్రంగా మీదుగా ప్రయాణించే వాహనదారుల కష్టాలు అన్నీఇన్నీ కావు. ఎక్కడికక్కడ రోడ్లు వర్షపు నీటితో ముంచెత్తి వాహనాలు కదిలే పరిస్థితి లేకుండా పోతోంది.

ఇదీ పోలీస్ స్టేషన్ దుస్థితి

సబ్బవరం పోలీస్ స్టేషన్ పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఇటీవల కురిసిన ఆకస్మిక వర్షాలకు స్టేషన్ ప్రాంతంలో భారీగా నీరు చేరుతుంది. లోపలికి వెళ్లేందుకు కూడా వీల్లేని పరిస్థితి. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మోస్తరు వాన కురిసిందంటే గంటల తరబడి వాహనదారులు పడిగాపులు కాయాల్సిందే.



వాహనాల రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందిపడే కోటపాడు-పినగాడి ప్రధాన రోడ్డు

కల్వర్టు పైనుంచి ప్రవాహం

సబ్బవరం-గుల్లేపల్లి రోడ్డులోని ఆదిరెడ్డిపాలెం వద్ద గెడ్డపై ఏర్పాటు చేసిన కల్వర్టు పైనుంచి ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కల్వర్టు తగినంత ఎత్తు, సామర్థ్యం లేకపోవడంతో ప్రధాన రహదారిలో గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. ప్రత్యామ్నాయ రోడ్లు లేకపోవడంతో నీటి ఉధృతి తగ్గేవరకు నిరీక్షించాల్సి వస్తోంది.

కోతకు గురవుతున్న రోడ్లు

కోటపాడు-పినగాడి రోడ్డులోని మొగలిపురం శివారు ప్రధాన రహదారిపై ఇటీవలి వర్షాలకు ప్రవాహం ముంచెత్తింది. కోడపాడు ప్రాంతం నుంచి పినగాడి మీదుగా విశాఖ వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నీటి ఉధృతికి రోడ్డు కోతకు గురవడంతో వర్షం సమయంలో వాహనాల రాకపోకలు సాగించలేని పరిస్థితి. తరచూ వాహనాలు రోడ్డుపై అడ్డంగా నిలిచిపోతున్నాయి.

కొండల నుంచి భారీ నీరు



వజ్రాల కొండ నుంచి వచ్చే నీటి ముంపులో అసకపల్లి సమీపంలోని సబ్బవరం-అసకపల్లి ప్రధాన రహదారి

సబ్బవరం-చోడవరం రోడ్డులోని **గొర్లివానిపాలెం జంక్షన్** వద్ద ఇటీవల కురిసిన **భారీ వర్షానికి పెద్ద చెరువే** ఏర్పడింది. గొటివాడలోని **సూదికొండతో** పాటు వజ్రాల కొండల **నుంచి భారీగా వాన** నీరు చేరింది. ఈ నీరు **బయటకు పోయేందుకు** వీలైన డ్రైన్లు, గెడ్డలు **పూడుకుపోయాయి.** వీటి పూడికలు తొలగించ**కపోవడంతో వాహనా**లు గంటల తరబడి నిలిచిపోయాయి.

డ్రైనేజీలేక అవస్థలు

సబ్బవరం నుంచి అసకపల్లి వరకూ హైవేకు అనుసంధానం చేసే ప్రధాన రహదారికి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో ఇరువాడ శివార్లలోని అసకపల్లి మలుపు వద్ద వర్షాలకు వజ్రాలకొండ నుంచి వచ్చే నీరు రోడ్లపై చేరి, భారీగా నిలిచిపోతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం దృష్టిసారించి, ఆక్రమణలు తొలగించి, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పూడికలు తొలగించాలి



రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి సబ్బవరంలోని గొర్లివానిపాలెం జంక్షన్ వద్ద భారీ నీరు నిలిచిపోయి చెరువును తలపింపించింది. అక్కడ నుంచి నీరు బయటకు వెళ్లే డ్రైన్లు పూర్తిగా పూడుకుపోయాయి. దీంతో నీటిలో వెళ్లలేక వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. డ్రైన్లలో పూడికలు తొలగిస్తే ఈ దుస్థితి ఉండదు.

– నంబారు పెంటారావు, రాయపుర అగ్రహారం

అధికారులు పట్టించుకోవాలి



కోటపాడు-పినగాడి రోడ్డు గుల్లేపల్లి నుంచి పినగాడి వరకూ ఉన్న బీటీ రోడ్డు ఇటీవలి వర్షాలకు మరీ అధ్వానంగా మారింది. లోతట్టు ప్రాంతం కావడంతో బీటీ రోడ్డుపై నీటి ప్రవాహంతో రోడ్డు కోతకు గురైందిది. మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు ఇదే పరిస్థితిలో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు పట్టించుకోవాలి.

– యర్ల నాయుడు, మొగలిపురం

‘పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లు నెరవేర్చాలి’

పరవాడ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల వైద్యులు సెప్టెంబరు 26 నుంచి వివిధ రూపాల్లో చేస్తున్న సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని, వారి డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని సిటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఆశా వర్కర్ల యూనియన్, సిటు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యుల సమస్యలపై చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వైద్యుల సమస్యలపై ప్రభుత్వం అధికారులతో జరిపిన చర్చలు విఫలం కావడంతో అక్టోబరు 5 నుంచి నిరసన దీక్షలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జీవో 99 ఉపసంహరణ, ఇన్ సర్వీస్ పీజీ కోటా పునరుద్ధరణ, క్రమం తప్పకుండా పదోన్నతులు, 104 సంచార చికిత్స అలవెన్స్, నేషనల్ ఇంక్రిమెంట్స్ తదితర న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైద్యుల సమ్మెకు సిటు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, దేముడమ్మ, సైదులమ్మ, వరలక్ష్మి, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న గనిశెట్టి

సుప్రీం సీజేపై దాడి అమానుషం

పెందుర్తి: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది రాజేష్‌కిషోర్ దాడికి పాల్పడడం బాధాకరమని బీఆర్ అంబేడ్కర్ సేవా సమితి ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. పెందుర్తిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సేవా సమితి ప్రతినిధులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అధ్యక్షుడు బోనాల యేసు జోసెఫ్, ప్రధాన కార్యదర్శి తోట సుబ్బారాయుడు, మంతెన అప్పారావులు మాట్లాడుతూ భారత ప్రధాన న్యాయమూర్తిపై దాడి అమానుషమని, ఇందుకు పాల్పడిన న్యాయవాదిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా సమితి ప్రతినిధులు కల్పన, అప్పల సూరి, జీవన్‌కుమార్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అంబేడ్కర్ సేవా సమితి ప్రతినిధులు

దేవీపురంలో ముగిసిన దసరా బ్రహ్మోత్సవాలు



జలహారతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పూజలందుకున్న సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన క్షేత్రంలో దసరా బ్రహ్మోత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిశాయి. చివరి రోజు అమ్మవారు సహస్రాక్షి రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. లలితా సహస్ర నామావళి హోమం జరిపించారు. సహస్రాక్షి అమ్మవారికి, రాజరాజేశ్వరునికి వేద పండితుల మంత్రోచ్చారణలతో కళ్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిపారు. సాయంత్రం 6 నుంచి విశాఖపట్నం ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్టీసీ బస్ ఢీకొని వృద్ధురాలి మృతి

పెందుర్తి: పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్ సుజాతనగర్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు దుర్మరణం పాలైంది. వివరాలివి.. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్ సమీపంలోని హస్మినగర్‌లో పసగడుగుల అప్పారావు, అమ్మాజీ(65) దంపతులు నివాసం ఉంటున్నారు. పనుల నిమిత్తం మంగళవారం సాయంత్రం అమ్మాజీ బయటకు వచ్చారు. తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో బీఆర్‌టీఎస్ రోడ్డు దాటుతుండగా మధ్య రోడ్డులో వస్తున్న ఆర్టీసీ బస్ బలంగా ఢీకొట్టింది. బస్ చక్రాలు ఆమె మీద నుంచి వెళ్లిపోవడంతో అమ్మాజీ అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్.నరసింగరాజు ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. లా అండ్ ఆర్డర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.





సుజాతనగర్ బీఆర్‌టీఎస్‌పై ప్రమాద దృశ్యం, (ఇన్‌సెట్) అమ్మాజీ మృతదేహం

వైఎస్ జగన్ పర్యటన విజయవంతం చేయాలి



పరవాడలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్



పెందుర్తి సమావేశంలో వివిధ వార్డులు, రూరల్ మండల నాయకులు

- వైఎస్సార్ సీపీ శ్రేణులతో నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పరవాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నర్సీపట్నంలో నిర్మాణం చేపట్టిన వైద్యకళాశాల పరిశీలనకు ఈ నెల 9న రానున్న రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈ నెల 9న ఉదయం 9 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా నర్సీపట్నంలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల వద్దకు వెళ్లనున్నట్లు తెలిపారు. పార్టీ అధినేతకు ఘన స్వాగతం పలికేందుకు నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఉత్తరాంధ్ర జిల్లాలకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వత్తాసు పలుకుతోందన్నారు. ఏయూలో మౌలిక వసతుల కల్పన గాలికొదిలేసిందని ఆక్షేపించారు. పేదలకు విద్య, వైద్యం అందుబాటులో ఉండాలనే సంకల్పంతో గత సీఎం జగన్ రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వం ఓర్వలేక వాటిని పీపీపీ విధానంలో ప్రైవేట్‌పరం చేయడానికి చూస్తోందని ఆక్షేపించారు.

కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, చుక్క రామునాయుడు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, కలపాక సర్పంచ్ బొండా కనకారావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు బండారు శ్రావణ్‌కుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈదలపాక సన్యాసిరావు, పార్టీ నాయకులు గొర్లి గోపి, పెదిశెట్టి శేఖర్, నంద వరపు శ్రీను, బొద్దపు చిన్నారావు, సూరాడ మసేను, మడక సూరిబాబు, డెక్క శ్రీనివాసరావు, పైల సత్యనారాయణ, సింహాద్రి, కన్నూరు నేస్తాలు, పాసిల దివ్య, గండి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 9న నర్సీపట్నం మెడికల్ కాలేజీ సందర్శించనున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. రాంపురం పార్టీ కార్యాలయంలో జీవీఎంసీ 93, 94, 95, 96, 97, 98వార్డుల ప్రతినిధులు, రూరల్ మండల నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గంలో నర్సీపట్నం వెళ్లనున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గాజువాక దరి లంకెలపాలెం కూడలిలో ఘన స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులంతా తరలి రావాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు బైలపూడి భగవాన్ జయరాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శరగడం చినఅప్పలనాయుడు, గండి రవి కుమార్, మదుపడ అంజి, మండల పార్టీ అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, వార్డు అధ్యక్షులు రాపర్తి మాధవరావు, తమర్ల నర్సింగ్, దాసరి సత్తిబాబు, మెంటి మహేష్, దాడి ఉమామహేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం



లక్ష్మి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న సోమునాయుడు, బ్యాడ్‌బాయ్స్ సభ్యులు

పరవాడ: పరవాడ గ్రామానికి చెందిన బాగారపు లక్ష్మి కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు వెంటాడడంతో వైద్యం పొందలేని స్థితిలో ఉంది. ఈ విషయాన్ని లక్ష్మి కుమారుడు తేజ స్థానిక బ్యాడ్ బాయ్స్ సభ్యులకు వివరించాడు. బ్యాడ్ బాయ్స్ సభ్యులు ఆ సమాచారాన్ని బీజేపీ నాయకుడు కూండ్రపు సోమునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బాధిత కుటుంబానికి రూ.70 వేలు ఆర్థి సాయం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు డీటీఎస్ నాగరాజు, బ్యాడ్ బాయ్స్ సభ్యులు బండారు అజేయ్, లాలం సురేష్, గండి దిలీప్ పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

- శాస్త్రోక్తంగా గరుడసేవ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. స్వామికి విశేష హారతులు అందించారు. భక్తులను గరుడ వాహనంపై చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

పీఆర్ఎస్ఐ వైస్ చైర్మన్‌గా బంగార్రాజు



కె.బంగార్రాజు

సింహాచలం: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ) విశాఖపట్నం చాప్టర్ వైస్ చైర్మన్‌గా శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు నియామకం అయ్యారు. విశాఖలో ఈ నెల 6న ఆర్ఎస్ఐ విశాఖ చాప్టర్ వార్షిక సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2025–27 కాలానికి నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. వైస్ చైర్మన్‌గా కె.బంగార్రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చాప్టర్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా బంగార్రాజు తెలిపారు.

మాదక ద్రవ్యాలకు బానిసలు కావద్దు

పెదగంట్యాడ: మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి ఇమంది శ్రీనివాసరావు సూచించారు. జాతీయ హెల్త్ మిషన్ సౌజన్యంతో పొగాకు, మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించినందుకు గాను, మండలంలోని ముగ్గురు విద్యార్థులను ప్రచారకర్తలుగా ఎంపిక చేశారు. వీరికి జిల్లా విద్య, వైద్య ఆరోగ్య శాఖాధికారులు ఇచ్చిన బహుమతులను కార్యాలయంలో మంగళవారం ఆయన అందజేశారు.